క్లుప్తంగా

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి


తెర్లాంలో సీఎస్‌డీటీకి వినతిపత్రం అందజేసిన రేషన్ డీలర్లు

తెర్లాం: మండలంలో పని చేస్తున్న రేషన్ దుకాణ డీలర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వెంటనే పరిష్కరించాలని మండల రేషన్ డీలర్ల సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. స్థానిక సీఎస్‌డీటీ కార్యాలయంలో సీఎస్‌డీటీ స్వర్ణలతను మంగళవారం వారు కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. రేషన్ డీలర్లకు రావల్సిన కమీషన్లు వెంటనే వచ్చేలా చూడాలన్నారు. రేషన్ డీలర్ల సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని డీలర్ల సంఘం నాయకులు కోరారు.

అంగన్‌వాడీలు బాధ్యతగా పని చేయాలి

రేగిడి: అంగన్‌వాడీ కార్యకర్తలు బాధ్యతగా పని చేసి ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలని రాజాం సీడీపీఓ డాక్టర్ కనకదుర్గ సూచించారు. బూరాడ, రేగిడి, సంకిలి సెక్టార్లలో మంగళవారం నిర్వహించిన అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని, కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. పౌష్టికాహారం లబ్ధిదారులకు క్రమం తప్పకుండా అందజేయాలని వెల్లడించారు. చిన్నారుల ఆరోగ్యం పట్ల ప్రతీ రోజు దృష్టి సారించి, గ్రోత్ తక్కువ ఉన్న చిన్నారులకు ఆరోగ్య సూత్రాలు, పౌష్టికాహారాన్ని అందజేయాలని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు శశికల, నూకాలమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులు


కందిశలోని ప్రధాన వీధిలో గడప గడపకు మన నిధులతో వేసిన సీసీ రోడ్డు


రేగిడి: మండలంలోని కందిశ, కోడిశ, చిన్నశిర్లాం, వెంకంపేట తదితర గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలను సర్పంచ్‌లు, ఎంపీటీసీలు చేపడుతున్నారు. దీర్ఘకాలికంగా ఉన్న రహదారులు, మురుగు కాలువలను నిర్మిస్తుండడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయడంతో అభివృద్ధి పనులు జోరందుకున్నాయి.

కస్తూర్బా పాఠశాల తనిఖీ


వివరాలు సేకరిస్తున్న ఎంఈఓ ప్రసాదరావు

రేగిడి: మండలంలోని దేవుదళ గ్రామంలోని ప్రభుత్వ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినిల అభ్యసనా సామర్థ్యాలపై ఆరా తీశారు. పదో తరగతి విద్యార్థినులు జాగ్రత్తగా చదవాలని, మంచి ఫలితాలు సాధించాలని వివరించారు. అనంతరం పాఠశాలలో మెనూపై ఆరా తీశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ


ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ

రాజాం: మండలంలోని పెనుబాక ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు మంగళవారం పంపిణీ చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు వీటిని విద్యార్థులకు అందించి మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందిస్తున్నారని అన్నారు. విద్యార్థులు ఈ ట్యాబ్‌లను సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఆనెం మహేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమరయోధుల మందిరానికి పుస్తకాల అందజేత

రాజాం:పట్టణంలో నివాసముంటున్న ప్రభుత్వ ఆంగ్ల ఉపాధ్యాయుడు అదపాక దామోదరరావు శ్రీకాకుళం పట్టణంలోని గాంధీ, స్వాతంత్య్ర సమరయోధుల మందిరానికి పుస్తకాలు అందజేశారు. మంగళవారం గాంధీ వర్ధంతి సందర్భంగా గాంధీజీ జీవితం ఆధారంగా తను ఆంగ్లంలో రచించిన మురిపించే కథలు అనే పుస్తకంతో పాటు పలు కథల పుస్తకాలను మందిర నిర్వాహకులకు జిల్లా ఏఎస్పీ విఠలేశ్వర చేతుల మీదుగా అందజేశారు. అనంతరం దామోదరరావుతో పాటు అతని కుమార్తె డాక్టర్ లిఖితలను అభినందించి, సత్కరించారు. కార్యక్రమంలో మందిరం నిర్వాహణ కమిటీ సభ్యులు శాస్త్రి, వి.జగన్నాథంనాయుడు, ఎం.ప్రసాదరావు, డాక్టర్ భీమశంకరరావు, ప్రొఫెసర్ విష్ణుమూర్తి, డాక్టర్ ఎస్.మోహనరావు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యం దిశగా అడుగులు

● గాంధీజీ వర్ధంతిలో ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: ప్రపంచ దేశాలు మెచ్చిన మన జాతిపిత గాంధీ మహాత్ముని ఆశయమైన గ్రామ స్వరాజ్యం దిశగా అడుగులు వేస్తున్నామని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. గాంధీజీ వర్ధంతి సందర్భంగా స్థానిక ప్రధాన విగ్రహం వద్ద మంగళవారం పూల మాలలు వేసి మహాత్మునికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంబంగి మాట్లాడుతూ అహింస, సత్యంలను ఆయుధాలుగా చేసుకుని దేశానికి స్వేచ్ఛ, స్వాతంత్య్రాలు తీసుకువచ్చిన మహోన్నత వ్యక్తి జాతిపిత గాంధీజీ అన్నారు. ఆయన కోరిన గ్రామస్వరాజ్యం స్థాపించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ జేసీఎస్ ఇన్‌చార్జి రేజేటి ఈశ్వర రావు(విసు), పట్టణ పార్టీ అధ్యక్షుడు చోడిగంజి రమేష్ నాయుడు, మున్సిపల్ కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.


బొబ్బిలి: గాంధీజీ వర్ధంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు


రాజాం : గాంధీజీ విగ్రహం వద్ద నివాళులు


రాజాం సిటీ: మున్సిపల్ కార్యాలయం వద్ద గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఇన్‌చార్జి కమిషనర్ నాగరాజు తదితరులు

గాంధీ ఆశయాలు ఆచరించాలి

రాజాం: మహాత్మాగాంధీ ఆశయాలు ప్రతీ ఒక్కరు ఆచరించాలని రాజాం మానవత చైర్మన్ కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ అన్నారు. రాజాం పట్టణంలో గాంధీవీధిలో మహాత్మా గాంధీ విగ్రహానికి మంగళవారం పూలమాలలు వేసి వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీ చూపిన మార్గంలోనే ప్రతీ ఒక్కరు నడవాలని కోరారు. కార్యక్రమంలో అన్నవరం ట్రస్టు బోర్డు సభ్యులు కొల్లూరు వెంకట్ నాగేశ్వరరావు, కొత్తా చంద్రావతి, పెంకి చైతన్యకుమార్, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వాకచర్ల పైడిరాజు, పిడుగు సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతిపిత వర్ధంతి

తెర్లాం: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో జాతిపిత గాంధీజీ వర్ధంతి కార్యక్రమాన్ని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

గాంధీ ఆశయాలను ఆచరించాలి

రాజాం సిటీ: జాతిపిత మహాత్మా గాంధీ ఆశయాలను ప్రతి ఒక్కరు ఆచరించాలని ఇన్‌చార్జి కమిషనర్ ఎంవీ నాగరాజు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని విగ్రహానికి మంగళవారం పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి, అహింసలను అనుసరించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ చక్రవర్తి, ఏఈలు వెంకట్, భాగ్యలక్ష్మి, టీఎంసీ ఎస్‌వీ రత్నం తదితరులు పాల్గొన్నారు.

కులగణనలో రావివలస ఫస్ట్


రామభద్రపురంలో కులగణన సర్వే పరిశీలిస్తున్న ఎంపీడీఓ

రామభద్రపురం: మండలంలోని కులగణన సర్వేలో రావివలస గిరిజన సచివాలయం ప్రథమ స్థానం, పాతరేగ సచివాలయం ద్వితీయ స్థానంలో ఉండగా కోటశిర్లాం సచివాలయం ఆఖరి స్థానంలో ఉందని ఎంపీడీఓ రమామణి తెలిపారు. మండలంలోని 17 సచివాలయాల పరిధిలో కులగణన సర్వే చేపట్టగా రావివలస సచివాలయం పరిధిలో 465ఇళ్లకుగాను 1542 మంది సభ్యులు ఉన్నారు. ఇందులో 457(98.28 శాతం)ఇళ్లు, 1476 (95.72 శాతం) మంది సభ్యుల వివరాలు నమోదు పూర్తి చేసుకుని ప్రథమ స్థానంలో ఉన్నట్లు తెలిపారు. కోటశిర్లాం సచివాలయం పరిధిలో 987ఇళ్లలో 2916 మంది సభ్యులు ఉన్నారు. ఇందులో 870(88.15 శాతం) ఇళ్లు, 2227(76.3 శాతం)మంది సభ్యుల వివరాలు నమోదు పూర్తి చేసుకుని ఆఖరి స్థానంలో ఉన్నట్లు తెలిపారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన మండల క్రీడాకారులు


క్రీడాకారులను అభినందిస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ

రామభద్రపురం: బొబ్బిలిలోని ఆడుదాం ఆంధ్ర నియోజకవర్గం స్థాయి క్రీడా పోటీలలో రామభద్రపురం మండల సచివాలయ క్రీడాకారులు ప్రతిభ చూపి జిల్లా స్థాయి ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలకు ఎంపికై నట్లు ఆయా సచివాలయాల పరిధిలోని ఉన్నత పాఠశాలల పీడీలు తెలిపారు. వీరంతా విజయనగరంలో జరగనున్న జిల్లా స్థాయి క్రీడా పోటీలలో పాల్గొంటారని చెప్పారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, ఎంపీడీఓ రమామణి అభినందించారు. జిల్లా స్థాయికి ఎంపికైన క్రికెట్ జట్టుకు మంచి బ్యాట్ కొనుగోలు చేసేందుకు ఎంపీపీ తన సొంత నిధులు రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో కొట్టక్కి, ఆరికతోట, రామభద్రపురం, బూసాయవలస పీడీలు రత్నకిషోర్, వి.అప్పలనాయుడు, శ్రీదేవి, రామినాయుడు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

కుల గణన పూర్తి చేయాలి


తెర్లాం: కుల గణన సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

తెర్లాం: మండలంలోని 21 గ్రామ సచివాలయాల్లో కొద్ది రోజులుగా జరుగుతున్న కుల గణన సర్వేను మరితం వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ ఆదేశించారు. మండలంలో జరుగుతున్న కుల గణన సర్వేను ఎటువంటి తప్పులు లేకుండా పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణలో సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు చేయాలని సూచించారు. గ్రామాంతరం వెళ్లిన కుటుంబాలకు ఓటీపీ సహాయంతో కుల గణన చేయాలన్నారు. కుల గణనలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా, కుటుంబంలోని వారు తెలియజేసిన అన్ని అంశాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సూచించారు. మండలంలోని అన్ని సచివాలయాల్లో 100శాతం కుల గణన పూర్తయ్యేలా పంచాయతీ కార్యదర్శులంతా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ కోరారు.

గ్రామాల్లో కులగణన

రాజాం: గ్రామాల్లో కులగణన చురుగ్గా జరుగుతుంది. మంగళవారం మండలంలోని గడిముడిదాం, అంతకాపల్లి, పొగిరి, దోసరి తదితర గ్రామాల్లో జరుగుతున్న ఈ సర్వేను ఈఓపీఆర్‌డీఓ వి.శ్రీనివాసరావు, ఏపీఓ సాయిరాం పరిశీలించారు. కులగణన సక్రమంగా చేయాలని ఆయా పంచాయతీల కార్యదర్శులకు సూచించారు.

వైఎస్సార్‌సీపీని భారీ మెజార్టీతో గెలిపించాలి


గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్

రాజాం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చి, తనను ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ రాజాం ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ ఓటర్లను కోరారు. మండలంలో ముద్దాడజోగివలస గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలతో పాటు పలువురు రిటైర్డ్ ఉద్యోగులు, పలు సంఘాల ప్రతినిధులను మంగళవారం కలుసుకున్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నేరుగా సంక్షేమ పథకాలు అర్హులకు అందుతున్నాయని వెల్లడించారు. జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు సీఎంగా గెలిపించాలని, ఇక్కడ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగించిన తనకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు, వైస్ ఎంపీపీ నక్క వర్షిణి, జేసీఎస్ కన్వీనర్ కామోదుల శ్రీనివాసరావు, కొయ్యాన భాస్కరరావు, కోటమ్మ చిరంజీవి, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా చిన్నపుదొర


ఎస్టీ కార్పొరేషన్ ఈడీ నుంచి నియామకపత్రం అందుకుంటున్న చిన్నప్పదొర

బాడంగి: ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కార్పొరేషన్ ట్రైకార్ డైరెక్టర్‌గా పారాది చిన్నప్ప దొర తిరిగి నియమితలయ్యారు. బాడంగి మండలం ఆకులకట్టకు చెందిన చిన్నప్పదొర గతంలో రెండేళ్ల పాటు డైరెక్టర్‌గా పని చేశారు. పదవీకాలం పూర్తవుతుండటంతో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు సిఫార్సు మేరకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి ఆయనను డైరెక్టర్‌గా నియమించారు. చిన్నప్పదొర ఎస్టీ కార్పొరేషన్ ట్రైకార్ నూతన డైరెక్టర్‌గా మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు.

4న విశాఖలో ఓట్ ఫర్ ఓపీఎస్

సంతకవిటి: సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్న నినాదంతో సాగర సంగ్రామ దీక్ష ఓట్ ఫర్ ఓపీఎస్ అన్న నినాదంతో ఫిబ్రవరిలో 4న విశాఖపట్నంలో నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఎంఈఓ సమక్షంలో మంగళవారం ఇక్కడ ఆవిష్కరించారు. కార్యక్రమంలో బి.పెంటన్నాయుడు, జి.దిలీప్‌కుమార్, బి.ఉమామహేష్, వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

'అమృత్ సరోవర్'తో చెరువుల అభివృద్ధి


తెంటువలస కోనేరు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న వేణుగోపాలనాయుడు

బాడంగి: చెరువుల అభివృద్ధికి అమృత్ సరోవర్ పథకం ఓ వరంలాంటిదని బొబ్బిలి ఎంపీపీ ప్రతినిధి, ఎమ్మెల్యే సోదరుడు శంబంగి వేణుగోపాలనాయుడు అన్నారు. రూ.9లక్షల ఉపాధి హామి నిధులతో మంజూరైన మండలంలోని తెంటువలస కోనేరు అభివృద్ధి పనులకు ఆయన మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామీణ ప్రజల కోసం ఇలాంటి ఎన్నో మంచి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజనేయులు, సచివాలయ కన్వీనర్ తెంటు రమేష్, మండల జేఏసీ కన్వీనర్ మరిపి శంకరరావు, ఏపీఓ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పార్కు పనుల పరిశీలన


పార్కు పనులు పరిశీలిస్తున్న డాక్టర్ తలే రాజేష్ తదితరులు

రాజాం: పట్టణంలోని బొబ్బిలి జంక్షన్ వద్ద ఎర్రావాని చెరువు పార్కు పనులను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ మంగళవారం పరిశీలించారు. ఏఈ భాగ్యలక్ష్మి వద్ద వివరాలు సేకరించారు. రాష్ట్ర బ్యూటిఫికేషన్ అండ్ గ్రీనరీ రూ.1.03 కోట్లు ఈ చెరువును పార్కుగా మార్చేందుకు నిధులు కేటాయించిందని ఏఈ ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ పనులు వేగవంతం చేస్తున్నామని, రాజాం పట్టణానికి ఆకర్షణగా ఈ పార్కు నిలవనుందని వివరించారు. రాజాం పట్టణ నడిబొడ్డున పార్కును ఏర్పాటు చేయడంపై ప్రభుత్వానికి పట్టణవాసులు కృతజ్ఞతలు తెలుపుతున్నారని ఇన్‌చార్జ్ అన్నారు. రాజాం పట్టణం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలోనే అభివృద్ధి చెందిందని వెల్లడించారు. ఆయన వెంట పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, నల్లా శ్రీనివాసరావు, శాసపు వేణుగోపాలనాయుడు తదితరులు ఉన్నారు.

టీడీపీ – జనసేన నీచ రాజకీయాలు

● వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధుల ధ్వజం


లైబ్రరీ మంజూరు, టెండర్ పత్రాలను చూపుతున్న మున్సిపల్ చైర్మన్, జేసీఎస్ ఇన్‌చార్జి, పట్టణ అధ్యక్షుడు

బొబ్బిలి: గత 15 ఏళ్లుగా బొబ్బిలిని పరిపాలించిన మీరు ఓ శాఖా గ్రంథాలయానికి నీడ కల్పించలేక పోయిన బేబీ నాయన, జనసేనతో కలసి నీచ రాజకీయాలు చేయడం దౌర్భాగ్యమని మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు అన్నారు. మంగళవారం ఆయన చాంబర్‌లో జేసీఎస్ పట్టణ ఇన్‌చార్జి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్ నాయుడు తదితరులతో కలసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైబ్రరీకి స్వంత భవనం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాక అద్దె భవనాలు ఎందుకని మున్సిపాలిటీలోని స్వంత భవనాలను రెండు పర్యాయాలు అప్పగించామన్నారు. అనంతరం గత సెప్టెంబర్ 22న స్థానిక కౌన్సిలర్‌తో కలసి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు పాడైన గ్రంథాలయ భవనాన్ని పరిశీలించి నిధుల మంజూరుకు కృషి చేశారన్నారు. రూ.1.60 లక్షలు మంజూరు కావడంతో మున్సిపల్ కౌన్సిల్ తీర్మానమై టెండర్లు పిలిచామని అందరికీ తెల్సిందేనన్నారు. విశాఖకు చెందిన కాంట్రాక్టర్ అనారోగ్య కారణాలతో తాను నిర్మించలేనని చెప్పడంతో రీటెండర్ వేయించి స్థానిక కాంట్రాక్టర్ బోరేషబాబుకు మంజూరైందన్నారు. భవన నిర్మాణానికి, మరమ్మతులకు అక్కడున్న పెద్ద బూరుగు చెట్టు అడ్డంగా ఉండటంతో ఇళ్ల మీద పడకుండా తొలగించాలని, భవనం పాఠకులకు సౌకర్యవంతంగా ఉండాలనే తలంపుతో ఎమ్మెల్యే శంబంగి సూచనలతో రూ.5లక్షలు మంజూరు చేయించారన్నారు. మొత్తం రూ.ఆరున్నర లక్షలతో రెండు పనులు గత నెల 30న మంజూరయ్యాయని, ఈ విషయం అందరికీ తెల్సిందేనన్నారు. అయితే పండగ పోయాక పనులు ప్రారంభిద్దామని అనుకుంటుండగా టీడీపీ, జనసేన నాయకులు నిరాహార దీక్ష చేయడం వారి కుళ్లు రాజకీయాలకు అద్దం పడుతుందని చైర్మన్ మురళీ కృష్ణారావు అన్నారు. వేణుగోపాల స్వామి ఆలయ కూడలి, ఎన్టీఆర్, తాండ్ర పాపారాయ కూడళ్ల వద్ద వెలుగులీనే పనులు చేస్తే బొబ్బిలి సుందరంగా ఉందని, లైట్లు ఎందుకు వేస్తున్నారని బేబీ నాయన అనడం హాస్యాస్పదమని చైర్మన్ అన్నారు. జేసీఎస్ ఇన్‌చార్జి రేజేటి ఈశ్వర రావు(విసు), పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్ నాయుడు, చోడిగంజి రాజగోపాల నాయుడు పాల్గొన్నారు.

మొక్కజొన్నను కాపాడుకోవాలి


వెంకంపేటలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏఓ

రేగిడి: రబీ సాగులో రైతులు పండిస్తున్న మొక్కజొన్న పంటను జాగ్రత్తగా చూసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారి జి.మురళీకృష్ణ రైతులకు సూచించారు. మండలంలో నాయిరాలవలస, వెంకంపేట తదితర గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న మొక్కజొన్న పంటను మంగళవారం పరిశీలించారు. ఈ పంటకు ప్రస్తుతం కత్తెర పురుగు ఆశిస్తుందని, రైతులు నిశితంగా పరిశీలించి, ప్రాథమిక దశలోనే పురుగు మందులు పిచికారీ చేయాలని వెల్లడించారు. కార్యక్రమంలో ఏఈఓ విజయలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

ఉపాధి పనులు గిట్టుబాటు కావాలి

రేగిడి: ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులు వేతనం గిట్టుబాటు అయ్యేలా పనులు చేసుకోవాలని ఏపీఓ హరనాథరావు వేతనదారులకు సూచించారు. అంబఖండి గ్రామంలో మంకువానిచెరువులో జరుగుతున్న పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. 26 మంది వేతనదారుల మస్తర్లు తనిఖీ చేశారు. రెండు పూటలా పని చేస్తే రూ.272 లు వేతనం వస్తుందని వెల్లడించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీధర్‌తో పాటు మేట్‌లు పాల్గొన్నారు.

మద్దివలసలో గడ్డివాము దగ్ధం


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

వంగర: మండల పరిధిలోని మద్దివలస గ్రామంలో మంగళవారం సంభవించిన అగ్ని ప్రమాదంలో గడ్డివాము దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఉత్తరావెల్లి హరికి చెందిన గడ్డివాముతో పాటు 20 బస్తాల ధాన్యం కాలిబూడిదయ్యాయని రైతు హరి తెలిపారు. స్థానికులు అందించిన సమాచారం మేరకు రాజాం ఫైర్‌స్టేషన్ ఎస్ఐ టి.ఎస్.ఎస్.జనార్దనరావు, సిబ్బంది టి.మోహనరావుతో సహా సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. దీంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు చెబుతున్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

రాజాం సిటీ: యువతలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు క్రీడలు దోహదపడతాయని, మానసిక ఉల్లాసం కలుగుతుందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్ అన్నారు. ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో నియోజకవర్గ స్థాయిలో విజేతలకు మంగళవారం స్థానిక జీసీఎస్ఆర్ మైదానంలో షీల్డ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో మంది ఆణిముత్యాలు ఉన్నారని, వారిని వెలికి తీసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా పేరిట క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారని అన్నారు. నియోజకవర్గ స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులంతా జిల్లా స్థాయిలో కూడా అదే స్ఫూర్తితో ఆడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ ఎంవీ నాగరాజు, నాయకులు పొగిరి లెనిన్, తోట తిరుమలరావు, శ్రీనివాసరావు, పిట్టా జగదీష్, పీడీలు పాల్గొన్నారు.

అలరించిన విద్యార్థుల నృత్యాలు



సంతకవిటి: మండల కేంద్రంలోని స్థానిక జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండియర్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా కళాశాల ప్రిన్సిపాల్ జనార్దనరావు, వైస్ ప్రిన్సిపాల్ షణ్ముఖరావు మాట్లాడుతూ విద్యార్థులు ముందుగా పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు. బాగా చదివి ఉన్నతంగా ఎదగాలని కోరారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి.

లైన్‌షోయింగ్ సాగుతో అధిక దిగుబడులు


లైన్ సోయింగ్ ద్వారా వేసిన పంట

రాజాం సిటీ: ప్రకృతి వ్యవసాయంలో భాగంగా లైన్ షోయింగ్ విధానం ద్వారా గులిరాగి సాగు చేపడితే అధిక దిగుబడి సాధించవచ్చునని ఎల్1 రమాదేవి సూచించారు. మండల పరిధి పొగిరిలో లైన్‌సోయింగ్ పద్ధతిలో రాగి పంట నాట్లు వేసే విధానాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో గులిరాగి పంట సాగు విధానంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. నారును బీజామృతంలో శుద్ధి చేసి లైన్‌సోయింగ్ పద్ధతి ద్వారా నాటుకోవాలని అన్నారు. ఈ విధానం ద్వారా 8 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని పేర్కొన్నారు. సాధారణ పంట కంటే ఈ విధానం ద్వారా మూడు రెట్లు అధికంగా పంట వస్తుందని తెలిపారు. ప్రతి 10 రోజులకు ద్రవ జీవామృతం పెట్టడంతో పాటు కాషాయాలు స్ప్రేయింగ్ చేయాలని సూచించారు. ఇలా చేయడం ద్వారా ఖర్చు తక్కువ అవుతుందని అన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీలు పాత్రుని వెంకటరమణ, నిర్మల, రైతులు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'తో సంపూర్ణ ఆరోగ్యం



తెర్లాం: కాలంరాజుపేటలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో పాల్గొన్న వైద్యులు, సచివాలయ ఉద్యోగులు


రామభద్రపురం: తారాపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యాధికారిణి, సిబ్బంది


రేగిడి: వెంకటాపురంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి

తెర్లాం: జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్–2 కార్యక్రమంతో ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ అన్నారు. మండలంలోని పూనువలస సచివాలయం పరిధిలోని కాలంరాజుపేట గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పెరుమాళి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలంరాజుపేట, జె.కొత్తవలస, పూనువలస, చినపాలవలస, పెదపాలవలస గ్రామాల్లోని ప్రజలు, రోగులకు పెరుమాళి పీహెచ్‌సీ వైద్యులతో పాటు, ప్రత్యేక వైద్య నిపుణులు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన మందులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆర్‌వీ రమణమూర్తి, బాడంగి సీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ పెద్దింటి నాగేశ్వరరావు, పెరుమాళి పీహెచ్‌సీ వైద్యులు శ్రీనివాస్, వైద్య అధికారులు, సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

రేగిడి: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి జి.అసిరినాయుడు ప్రజలకు సూచించారు. మంగళవారం కె.వెంకటాపురం, ఖండ్యాం గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి, ప్రజలకు తనిఖీలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.